## తన ఇష్టానికి అనుగుణంగా భార్య ప్రవర్తిస్తున్నా అతనికి బోర్ కొట్టడానికి కారణం?

# ధర్మేచ..కామేచ..

**రాంపల్లి వసుంధర కథ**

'షా వెలాస్' లాంటి కంపెనీలో మిత్రులు ఉండడం ఎంత అదృష్టమో ఇప్పుడు నాకర్థమయింది! కాకతాళీయంగా రైల్లో అయిన పరిచయం! ఒకేవూరు అవడంవల్ల మిత్రంగా మళ్ళీమళ్ళీ కల్సుకోడం ద్వారా దినదినాభివృద్ధి చెందిన ఆ స్నేహం అప్పుడప్పుడు 'కల్సి మందు కొట్టే' దాకా వెళ్ళడంతో మరికాస్త బలపడింది!


అసలు మా స్నేహం మందుదాకా వెళ్ళడానికి, నా మిత్రుడు 'షావెలస్'లో పని చెయ్యడమే బలమైన కారణం! 'చుట్టూ అన్నికరాల సీసాలు పెట్టుకుని తాగాలి అన్న టెంప్టేషన్ రాక చస్తారా ఎవరైనా? ఒకవేళ అలా రాలేదు అంటే, వాడు మనిషి కాదు. 'పొగతాగనివాడు దున్నపోతైపుట్టున్...' అన్నట్టు, 'మందు తాగనివాడు మదపుటేనుగై పుట్టున్...' అనాలి!

ప్రతి సంవత్సరం రకరకాల కొత్తకొత్త రకాల 'మందుల'తో బాటు, వ్యాపారపరంగా అత్యంతాకర్షణీయమైన చిన్నచిన్న గిఫ్ట్, కేలండర్స్ — మళ్ళీ వాటితో బాటు న్యూఇయర్ గిఫ్ట్స్ — ఇలా తెగ అందజేస్తారు, ఇలాంటి కంపెనీ వాళ్ళు!

'ఆ! చాలామంది చేయిస్తారు. అందులో ప్రత్యేకత ఏమిటి?' అని అనుకోకండి! అక్కడే వుంది అసలు రహస్యం! కీ చెయిన్‌లు, పెన్‌టార్చ్‌లు, యాష్ ట్రేలు, తాగుడు సామాను అమ్మే కంపెనీ కాబట్టి ఐస్ క్యూబ్స్ కోసం అందమైన ఫ్లాస్క్స్ — వీటి గురించి నేను గొప్పగా చెప్పడంలేదు.

చెప్పబోయేది 'కేలండర్స్' గురించి!

అందమైన కేలండర్ల మాట కొస్తే చాలా




సంస్థలున్నాయి. ఎన్నెన్నో ప్రైవేటు సంస్థల నుండి 'ఎయిర్‌లైన్స్' లాంటి గవర్నమెంటు సంస్థల వరకు బ్రహ్మాండమైన... 'వర్తీకీపిం గ్' కేలండర్లు వేస్తారు! 'ఓ.కె.' ఒప్పుకుంటున్నాము.

కాని — 'ఇదిగో నా బెడ్‌రూంలో తగిలించిన లాంటి కేలండర్స్ ఎన్నిచోట్ల దొరుకుతాయి చెప్పండి?' ఇలాంటి

'మ్యాడ్ కేలండర్స్' దొరకడం అంత తేలిక్కాదు తెలుసా?

'ఇలాంటి ఫోజ్ ఇవ్వడానికి మన ఇండియన్ గర్ల్స్ కెక్కడున్నాయి అన్ని గట్స్?'... . ఆ కేమెరా... ఆ ఫోటోగ్రఫీ... ఆ సీనరీ... అవన్నీ ఒక ఎత్తు అయితే, కేవలం... కేవలం ఆ మోడల్ ఒక ఎత్తు!... సానపట్టిన పాలరాయిని మించిన శరీరపు నునుపుతనం, గులాబి రంగులో మెరిసిపోయే

ఆ రూపలావణ్యం... ఆహ్. ఆ నీలిసముద్రంలో ఈతలు కొడుతూ కొడుతూ హఠాత్తుగా వడ్డుకి వచ్చిన ఆజానుబాహువుల, ఆరున్నర అడుగుల పొడవైన, బలమైన ఆ జలకన్య అందం... ఒహ్!... మొలకి నామ మాత్రం అలవోకగా కట్టిన బెత్తెడు వెడల్పు ఎర్రని శాటిన్ క్లాత్‌పీస్ తప్ప, ఎక్కడా మరో ఆచ్ఛాదన లేని ఆ శరీరంలో మాడగానే కళ్ళల్లో గుచ్చుకున్నట్టుగా కనిపించే ఆ...' ''ఇదిగో కాఫీ!... ఛ! అదేంటి. ఆ కేలండరు?'' గదిలో అడుగుపెడుతూనే అసహ్యంగా మొహం పెట్టింది నా అర్ధాంగి అనూరాధ.

కొంటెగా కన్ను గీటను.

''మనిళ్ళల్లో పెట్టుకోతగ్గ కేలెండరేనా అంది?'' చిరు కోపంగా అడిగింది.

''ఎలాంటి ఇళ్ళు?'' అని కాదు ప్రశ్న! ఎలాంటి మనుష్యుల మధ్య వుండాలి అనేది. ఆ కేలండర్‌కి కరెక్ట్ ప్లేస్ ఇదే మన మధ్య వుండతగ్గ కేలండర్ అది!'' శ్రీకృష్ణుడు, అర్జునుడికి 'గీత' ఉపదేశించినట్లుగా చెప్పాను.

''ఓ భయం లేదు! భక్తి లేదు! దేవుళ్ళ కేలండర్లు పోయి సినీతారల కేలండర్లు వచ్చాయి. ఆ మోజు కూడా పోయి చివరకి ఇంత దిగజారిపోయి... అధ్వాన్నంగా. ..'' నేను 'బ్రేక్' వెయ్యకపోతే ఆ ప్రవాహం అలాఅలా సాగి 'నీతి ముక్తావళి' కార్యక్రమం అయ్యే ప్రమాదం వుంది.

''చూడు అనూ! 'ఏ వయస్సులో ఆ ముచ్చట' అన్నారు! ఇది రసవత్తరమైన రక్తిదాయకమైన కాలం! ఇలాగే సాగాలి! పూజ గదిలో దేవుడి కేలండర్ పెట్టుకో! డ్రాయింగ్ రూంలో అందమైన సీనరీలో, సాంప్రదాయక నర్తకీమణుల కేలండర్లో పెట్టుకో! ఈ గదిలో... అంటె మన బెడ్ రూంలో మాత్రం ఈ కేలండర్ ఇలా వుండనియ్యి!

భక్తికి, ముక్తికి ముందుముందు మనకి చాలా టైముంది!'' ఓ చేత్తో దగ్గరికి లాక్కుని అనునయంగా చెప్పాను.

మూతి ముడుస్తూ, నాకేసి కొరకొరా చూస్తూ ఖాళీ అయిన కాఫీ కప్ తీసుకుని వెళ్ళిపోయింది.

అనురాధతో నా పెళ్ళయి ఇంకా ఏడాది కాలేదు. ఇంకా ఇంట్లోకి మూడో మనిషి రాలేదు. ఇంత పల్లిగ్గా ఇలాంటి కేలండర్ తగిలించుకుని ఎంజాయ్ చేసే అదృష్టం ఎంతమందికి కలుగుతుంది?

ఆ రాత్రి ఆ కేలండర్‌లోని పన్నెండు పేజీలని చూపించాను అనూరాధకి. ముందు కళ్ళు మూసుకుంది! తర్వాత ఓరగా, ఆ పై నాకేసి కోరగా చూసింది. ఓ పక్క ఆసక్తిగా చూస్తూనే మరి కాసేపటికి 'ఛ' గుణింతం వల్లించింది!

"మరీ ఇంత బరితెగించేస్తున్నారేవిటండీ బాబూ!'' అని విసుక్కుంది. లోలోపల నా రసికతకి ఆనందిస్తున్నట్టే అనిపించింది నా మటుక్కు. "ఇంతకీ ఇంత వెధవ బుద్ధులున్న ఆ మాయదారి ఫ్రెండ్ ఎవరండి? తక్షణం అతని స్నేహం మానేయండి!'' కోప్పడుతూ చెప్పింది. కానీ, ఆమెకి అంతగా కోపం వచ్చినట్టు నాకనిపించలేదు.

రోజూ రాత్రి పడుకోబోయే ముందు... అదే పడక ఎక్కే ముందన్నమాట, కాసేపు ఆ కేలండర్లలోకి... లోలోకి... లోతుగా చూసి ఆనందించి... ఆహ్లాదపడి... అనుభూతి చెంది ఆ ధాదాత్మ్యంలో...''

అలా సాగుతోంది, 'సం..సార' జీవితం!

పైపైకి ఎన్నున్నా అనూరాధకీ బాగానే వున్నట్టుంది ఈ 'నైట్ గేమ్స్' కొన్ని రోజులు బాగానే గడిచాయి!

కాని, ఈ మధ్య మా అనూరాధ మంచం ఎక్కుతూనే వణుగుడు, నసుగుడు మొదలుపెడుతోంది!

నాకేమి అర్థం కాలేదు, వాటి అంతరార్థం!

ఇదివరకటి వుషారులేదు ఆమెలో!... అంతా మొక్కుబడిలా ప్రవర్తిస్తోంది! నాలో అసహనం రాజుకుంటూంది. ఏమీ అనే పరిస్థితి కాదు, అనే సమయమూ కాదామె! ఎలా?!? ఏదో ప్లాన్ చేసి విషయం రాబట్టాలి!

** ** **

రెండు రోజుల్లో దసరా పండుగ వస్తోంది! అది నా అదృష్టం! చీరలకి, నగలకి లొంగని ఆడవాళ్ళుంటారా? మాంచి ఖరీదయిన పట్టు చీర ఒకటి కొన్నాను. నాకు గుర్తున్నంత వరకు ఆమె అలంకరణ సామగ్రి కొంత కొన్నాను. ఇవన్నీ ఇచ్చి ఆమెని సర్ప్రయిజ్ చేసి, ఆమె ఆనందంలో తేలిపోయే వేళ మెల్లగా లాలించి... బుజ్జగించి అసలు విషయం ఏమిటో



కనుక్కుంటెసరి!

పండుగనాడు పిండి వంటలతో భోజనం! సినిమా, షికార్లు ముగించుకుని, సెక్స్ సబ్జెట్‌గల ఇంగ్లీషు సినిమా వీడియో కేసెట్ ఒకటి తీసుకుని కుషీగా ఇల్లు చేరాను.

గదిలోకిరాగానే పట్టుచీర అనూరాధ చేతిలోపెట్టి, ''అలంకరించుకుని ఈ చీర సింగారించుకునిరా! ఈరోజు పండుగ స్పెషల్'' అన్నాను వీడియో కేసెట్ చూపిస్తూ, చిలిపిగా కన్నుగీటి. నేననుకున్నట్లుగానే పట్టుచీర చూడగానే అనూరాధ కళ్ళు మిలమిలలాడాయి. అలంకార సామగ్రి పరీక్షించి ఆనందం ప్రదర్శించింది.

''మీరు గదిలోంచి బయటకి వెళ్ళండి!'' గోముగా చెప్పింది.

''ఇదేమిటి? ఈ కొత్త అలవాటు?''

''అబ్బ చెప్పినట్టు చెయ్యండి!'' వీపుమీద చేతులు వేసి తోసింది.

''ఓకె! ఓకె!''

సరిగ్గా ఐదు నిముషాల్లో, 'రండి!' అని పిలిచింది.

మెరూన్, బ్లూ కల్సిన ఆ చెక్స్ డిజైన్ చీరలో అనురాధ అందాన్ని ఊహిస్తూ గదిలో అడుగుపెట్టాను.

అంతే — నోట మాటరాలేదు నాకు.

నేను తెచ్చిన పట్టుచీర కాదు! అసలు చీరే కాదు. 'అతి చిన్న ఎర్రటి పేంటీ, అతి పల్చని ఎర్రటి బ్రాసరీ' — అంతే ఆమె డ్రస్!

ఆమెని సర్‌ప్రయిజ్ చెయ్యాలనుకున్న నేనే సర్‌ప్రయిజ్.. కాదు.. షాక్ తిన్నాను.

పెదవులకి ఎర్రటి లిప్‌స్టిక్‌తో, విరబోసుకున్న కురులతో అచ్చం ఆ కేలండర్లో బొమ్మలా ఓ పక్కకి ఒరిగిపోయినుంచుని, థంప్సప్ బాటిల్ పట్టుకుని, 'కమాన్ డియర్!' అంటోంది మత్తుగా.

'బాప్‌రే! తెగిస్తే ఈ ఆడవాళ్ళు ఎంతవరకు పోగలరు!'

''అనూ!'' ఆశ్చర్యానందాలతో ఆమెని సమీపించాను.

** ** **

రెండు మూడు రోజుల అలాగే గడిచాయి! నాలుగో రోజు రాత్రి అడిగాను, ''రోజూ ఎందుకు అనూ! ఇక చాల్లే!''

''ఏం బావోలేదా? బాగోలేనా?'' నొక్కి నొక్కి అడిగింది.

''నాకు బాగానే వుంటుందనుకో!... కాని...'' ఏం చెప్పాలో తెలియక మాటలకి తడుముకుంటున్నాను.

''మరింకేం?'' కేర్‌లెస్‌గా మంచం మీద పడుకుని అడిగింది.

''అదికాదు...''

''ఏదీ కాదు? ఎవరో విదేశీ వనితల్ని న్యూడ్‌గా చూసి గుటకలు మింగడం బాగుందా? ఆ ఫోటోలు చూస్తూ, వాళ్ళలా నన్ను వూహించుకుంటూనో, లేక నన్ను వాళ్ళే అనుకుంటూనో మీరు వెర్రెత్తిపోవడం బాగుందా? ఎవరో న్యూడ్ అమ్మాయిల ఫోటోలు చూస్తూనో, సెక్స్ సినిమాలు చూస్తూనూ ప్రేరేపించబడి, ప్రేరేపించుకుని... అలాంటి సంసారం మీ మగవాళ్ళకి బావుంటుందేమో కాని, మా ఆడవాళ్ళకి కాదు!

అలాంటి ప్రేరణ ఏదో నానుంచే కలగాలి మీకు. అలా కలగకపోతే చెప్పండి! నా ప్రయత్నాలు నేను చేస్తాను. లేదా మీకు తోచిన సలహా మీరే ఇవ్వండి!... నేనూ ప్రేరణ కోసం అంటూ మీలా ఎవరి ఫోటోలో చూస్తూ కూర్చుం..."

"అనూ!..." ఉలికిపడి పిలిచాను, ఆమె ప్రాక్టికల్ ట్రీట్‌మెంట్ తాలుకు లెక్చర్‌ని ఆపేస్తూ.

"చూశారా? ఆ ఆలోచనకే భయపడి పోతున్నారు! ఖంగారు పడకండి! ఇలాంటి సమస్యలు రాకుండానే సంసార స్త్రీకి పుట్టుకలోనే 'సిగ్గు' అనే ఒక ఆభరణాన్ని ధరింపచేసి మరీ వదిలాడా బ్రహ్మదేవుడు ఈ భూమ్మీదకి.

అయినా మీ మగవాళ్ళంతా ఇలా ప్రవర్తిస్తే మరి పెళ్ళినాడు, 'ధర్మేచ... అర్థేచ... కామేచ... మోక్షేచ...' అని మీరు చేసిన ప్రమాణానికి అర్థమేది? విలువేది? ఊఁ. చెప్పండి మరి?" నా భుజాలు రెండూ పట్టుకుని నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నిస్తోంది అనూరాధ

●

